# విజయీభవ



- చెడుపై మంచి విజయం సాధించిన రోజు
- నేడే విజయదశమి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు


జగిత్యాల, అక్టోబర్ 22: విజయ దశమి హిందువులకు విశిష్టమై రోజు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా నిర్వహించుకునే పండుగ. చిన్నాపెద్దా అందరూ ఒక్కచోట చేసుకొనే వేడుక. ఈ రోజు చేపట్టే ప్రతీ పనిలో విజయం లభిస్తుందని నమ్మకం. అందుకే శక్తి స్వరూపిణీ ఆశీస్సులతో ప్రారంభిస్తారు. దసరా అంటే పది దుర్గుణాలపై గెలిచే సాధిం చే శక్తినిచ్చేది. దశహర అనే సంస్కృత పదం క్రమంగా దసరాగా మారింది. మనలో పది అవగుణాలైన కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్య, స్వార్థ, అన్యా య, అమానవత్వ, అహంకారంపై జయించే శక్తినిచ్చేది కనుకనే దీనిని విజయదశమి అని కూడా అంటారు.

**పండుగ నేపథ్యం..**

మహిషాసురుడు బ్రహ్మవరం వల్ల గర్వితుడై ముల్లోకాలను బాధ పెడుతుంటే ఆ బాధలు భరించలేక దేవతలు త్రిమూర్తులను వేడుకున్నారు. త్రిమూర్తులు సకల లోక పావనీ దుర్గామాతను స్తుతించారు. దుర్గామాత తొమ్మిది రోజుల పాటు భీకర పోరాటం సాగించి తొమ్మిదో రోజు మహిషాసురున్ని సంహరిస్తుంది. ఆ రోజు ఆశ్వయుజ మాసం శుద్ధ నవమి. దుర్గామాత దుష్ట శిక్షణ గావించిన మరునాడు జరుపుకున్న విజయోత్సవమే విజయ దశమి.

**శమీపూజ..**

విజయదశమి రోజు శమీ 'జమ్మి చెట్టు)దర్శనం, శమీ పూజ చేయాలని శాస్త్ర వచనం.. పూర్వం ప్రజాపతి పంచ భూతాల్లో భాగంగా అగ్నిని సృష్టించాడు. అయితే అగ్ని తననే దహించివేయ సాగింది. దీంతో ఆందోళన చెందిన ప్రజాప్రతి అగ్నిని శమింపజేసేందుకు ఓ వృక్షాన్ని సృష్టించాడు. అదే జమ్మిచెట్టు. ఇంతటి విశిష్టత కలిగిన ఈ వృక్షం వద్దకు విజయదశమి నాడు చేరుకొని ప్రదక్షిణలు చేయడం ఆచారం. ఇలా చేయడం ద్వారా చేపట్టిన పనుల్లో విజయం సిద్ధిస్తున్నది నమ్మకం.



**ఆయుధ పూజ..**

మహిషాసురుడిని వధించడానికి దుర్గాదేవి అష్టభుజాలతో అవతరించింది. హిమవంతుడు ఇచ్చిన సింహాన్ని అధిరోహించి మహిషాసుర మర్ధన చేసింది. అందువల్లే ఆయుధాల్ని పూర్వం రాజులు అలంకరించి పూజించేవారు. ఆ ఆచారంతోనే దసరా రోజు యంత్రాం, వాహన, పనిముట్లకు పూజలు చేయడం, వాహనాలను, యంత్రాలను పూలతో అలంకరించడం, ఫ్యాక్టరీలలో, భారీ వాహనాల ముందు జంతు బలి ఇవ్వడం ఆనవాయితీ.

**పాల పిట్టల దర్శనం..**

దసరా రోజు పాల పిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉంది. ఈ రోజున మూడు రకాల పక్షులను చూడడం ఆనవాయితీ. పాల పిట్టను చూస్తే పాపాలు, కర్రెపిట్టను చూసే కష్టాలు, గరత్మంతుడిని చూస్తే గండాలు తొలుగుతాయని విశ్వాసం.

**ఘనంగా పండుగ ఏర్పాట్లు..**

విజయదశమి సంబురాలను సోమవారం జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. ఈ మేరకు ఆయా కాలనీలు, దుర్గామాత మండపాల వద్ద శమిపూజలు, వాహన పూజలు నిర్వహించేందు కు ఏర్పాట్లు చేస్తున్నారు. గిద్దెపెరుమాళ్ల ఆలయం లో ఎండోమెంట్ అధికారులు, మార్క్‌ఫెడ్ మైదా నం రావణ దహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

# బీఆర్ఎస్ సర్కారుతోనే ధరణికి రక్షణ

- కాంగ్రెస్‌కు అధికారమిస్తే అంధకారమే
- తెలంగాణ రైతు సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎడమ వెంకట్‌రెడ్డి

కలెక్టరేట్, అక్టోబర్ 22: బీఆర్ఎస్ సర్కారుతోనే ధరణి పోర్టల్‌కు రక్షణ ఉంటుందని తెలంగాణ రైతు సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి ఎడమ వెంకటరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారమవుతుందని చెప్పారు. శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన రైతు సంక్షేమ సమితి జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ మేధోమథనం చేసి ధరణిని తెచ్చి ఏండ్ల నాటి భూములకు హక్కులు కల్పించారన్నారు. కానీ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డూరమన్నారు. దుష్ట కాంగ్రెస్ పాలనలో ఎందరో రైతులు కరెంట్‌షాక్‌లు, పాముకాట్లకు గురై మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోందని విమర్శించారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, తప్పించుకునే యత్నం చేస్తుందని ఆరోపించారు. రైతులకు కరెంట్, కనీసం రేషన్ బియ్యం సరఫరాలోనూ విఫలమైందన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతి పాలుకాక తప్పదన్నారు. ఆలోచించి ఓటేసి పనిచేసే పాలకులకే పట్టంగట్టాలని కోరారు. సమావేశంలో రైతు సంక్షేమ సమితి నాయకులు ఊరడి కృష్ణారెడ్డి, తమ్మల రాజేశం, ఎగ్గడి వెంకటయ్య, వొద్దిరాల వెంకట్రాజం, పెద్దబొంకూర్ రవిబాబు, చాట్ల మల్లేశం, ఎం.నారాయణరెడ్డి, కంకణాల విజయపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ఎర్రబెల్లి సంతోష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అల్లరి
ALLARI




## విజయదశమి
కథ

**పూర్వం** మహిషాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మదేవుడి గురించి తీవ్రమైన తపస్సు చేశాడు. ప్రత్యక్షమైన బ్రహ్మ.. ''ఏ వరం కావాలో కోరుకో!'' అన్నాడు. దానికి మహిషుడు.. ''నాకు ఏ పురుషుడి చేతిలోనూ మరణం లేకుండా వరం ఇవ్వు స్వామీ!'' అని కోరుకున్నాడు. బ్రహ్మ ''తథాస్తు!'' అనడంతో.. మహిషుడికి ఎక్కడలేని అహంకారం పెరిగిపోయింది. ఈ వరం కోరుకోవడం వెనుక మహిషాసురుడి ఉద్దేశం.. ఆడవాళ్లు తనను ఏమీ చేయలేరనే అహంకారమే! కానీ, ఆ అహమే తనను అంతం చేస్తుందని అతడు తెలుసుకోలేకపోయాడు. వరం పొందిన మహిషుడు దేవతలను, ప్రజలను హింసించేవాడు. దాంతో వారంతా త్రిమూర్తుల దగ్గరికి వెళ్లి మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ – విష్ణు – మహేశ్వరులు.. ''మేము మహిషుణ్ని అంతం చేయలేము. అది బ్రహ్మ ఇచ్చిన వరం! కానీ, ఒక మహిళ చేతిలోనే మహిషుడు అంతమవుతాడు!'' అని చెప్పారు. దాంతో ఇంద్రాది దేవతలంతా కలిసి త్రిమూర్తుల సహాయంతో.. 18 చేతులు కలిగిన ఒక స్త్రీ శక్తి రూపాన్ని సృష్టించారు. ఆ శక్తికి విష్ణుమూర్తి సుదర్శన చక్రాన్ని, శివుడు త్రిశూలాన్ని, ఇంద్రుడు వజ్రాయుధాన్ని సమర్పించారు. అలా దేవతలంతా తమతమ ఆయుధాలను ఆ శక్తికి సమర్పించారు. అలా 18 చేతుల్లో మారణాయుధాలను ధరించిన ఆ శక్తే.. దుర్గామాతగా అవతరించింది. ఈ ఆయుధాలకు తోడు అత్యంత శక్తిగల వాహనం సింహాన్ని కూడా సమర్పించారు. అలా సకల ఆయుధాలతో మహిషాసురుడితో యుద్ధం ప్రారంభించింది దుర్గాదేవి. ఆ యుద్ధం తొమ్మిది రోజులు సాగింది. చివరికి అమ్మవారు పదో రోజున మహిషుణ్ని సంహరించింది. యుద్ధం చేసిన ఆ తొమ్మిది రోజులే దేవీ నవరాత్రులుగా మారాయి. మహిషుణ్ని సంహరించినందున, దుర్గామాత విజయానికి గుర్తుగా.. పదోరోజు విజయదశమిగా మారింది. దశమి రోజున విజయం సిద్ధించింది కాబట్టి.. ప్రజలంతా ఈ రోజును విజయదశమిగా జరుపుకొంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తే.. దసరా పండుగ.

## రంగులేయండి

కింద ఇచ్చిన 'రావణ దహనం' బొమ్మకు రంగులేయండి.



## తెలుసుకుందాం




1. రామాయణంలో రావణుడిపై విజయం సాధించడానికి రాముడు ఏ పూజ చేశాడు?
   – దుర్గాపూజ
2. పాండవులు అజ్ఞాతవాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను ఏ చెట్టుపై ఉంచారు?
   – శమీ వృక్షం (జమ్మి చెట్టు)
3. దసరా పండుగను మొత్తం ఎన్ని రోజులు జరుపుకొంటారు?
   – పది రోజులు

## శ్లోకం



శమీ శమయతే పాపం
శమీ శత్రు వినాశనం
అర్జునస్య ధనుర్ధారి
రామస్య ప్రియదర్శిని॥

## మంచిమాట



ధనం రూపంలో లక్ష్మీదేవి ప్రపంచాన్ని పోషిస్తున్నది. జ్ఞానం రూపంలో సరస్వతీ మాత ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్నది. శక్తి రూపంలో దుర్గామాత ప్రపంచాన్ని నడిపిస్తున్నది. కాబట్టి, వేర్వేరు రూపాల్లో కనిపించినా.. ఈ ముగ్గురూ ఒక్కరే. ఆమే.. అందరికీ జగన్మాత!

## లిటిల్ హ్యాండ్స్

ఏనుగుల యోగేందర్
ఖమ్మం



## చెప్పుకోండి

దసరా పండుగ రోజున ఈ పిట్టను చూడటం శుభ సూచకంగా భావిస్తారు. ఇంతకీ ఇది ఏ పిట్ట?



జవాబులు :

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా :
zindagi@ntnews.com